
# ఎవడు కొడుకు

## భమిడిపాటి భాస్కర రామారావు



సూర్యోదయానికి ముందే స్నానం ముగించాడు రామశాస్త్రి. శరీరంపై విభూతి ధరించి కాలవ గట్టున ఉన్న రావిచెట్టు తిన్నె మీద కూచున్నాడు.

సరిగ్గా సూర్యోదయం అయ్యే వేళకు అర్ఘ్యప్రదాన కార్యక్రమం ముగించాడు. తరువాత ధ్యాన ముద్రలో మునిగిపోయాడు.

అతడు కళ్ళు తెరిచే సరికి తాను కూచున్న తిన్నెకు కాస్త దూరంగా ఎవరో నిలబడి తన వైపే చూస్తున్నట్టు గమనించాడు. 'ఎవరా' అని కాస్త పరకాయించి చూశాడు. ఆ నిలబడ్డ వ్యక్తి రాజన్నగా గుర్తించాడు. రాజన్నను అనుకుని ఓ కుర్రవాడు కూడా కనిపించాడు. ఆ కుర్రాడి వయసు మహా ఉంటే ఏడెనిమిది సంవత్సరాలుండవచ్చు ననుకున్నాడు రామశాస్త్రి.

ఎదురుగా నిలబడి శాస్త్రి ఎప్పుడు కళ్ళు తెరుస్తాడా అని జాగ్రత్తగా చూస్తున్న రాజన్న, "దండాలండయ్యగోరూ!" అన్నాడు చేతులు రెంటినీ శిరసు మీద దోసిలిగాపట్టి.

"నువ్వటరా రాజన్నా! ఏమిటిలా వచ్చావు?" అడిగాడు శాస్త్రి.

రాజన్న నిలబడ్డ చోటునుండి అంగుళం కూడా ముందుకు రాకుండా అక్కడి నుండే ఏదో చెప్పబోయాడు.

"నీ మొహంలా ఉంది. అంత దూరం నుండి అరచినట్టు చెప్పడం దేనికిరా! ఇలా దగ్గరగారా!" అన్నాడు శాస్త్రి.

రాజన్న సందేహిస్తూ అలాగే నిలబడి పోయాడు.

"ఒరేయ్! ఎందుకురా ఆ సందేహం? ఇలారా!" అన్నాడు శాస్త్రి తిరిగి.

"మా బోటోల్లు తమకు దగ్గరగా వస్తే తమరంటొడి పోతారండయ్యగోరూ!" వినయంగా అన్నాడు రాజన్న.

రామశాస్త్రి గాంధీ సిద్ధాంతాలన్నీ ఆకళింపు చేసుకున్న వ్యక్తి. గీతాసారం అంతా కాచి వడపోసిన దిట్ట. గాంధీగారి పేరు చెప్పుకుంటూ ఆయన సిద్ధాంతాలకు బద్ధ వ్యతిరేకంగా బ్రతుకీడ్చే రాజకీయ వాదికాదు రామశాస్త్రి. చేత నయినంత వరకూ గాంధీగారి సిద్ధాంతాలకు అనుగుణంగా నడుచుకునే సామాన్య మైన బడిపంతులు. నిజానికి అతడే అసలు సిసలైన గాంధీయుడు.

రాజన్న మాటలలోని దైన్యం, బెరుకు రామశాస్త్రి హృదయాన్ని కదిలించి వేశాయి. ఇక తానెంతగా చెప్పినా రాజన్న తనకు దగ్గరగా వచ్చే సాహసం చేయలేడని అర్థమవడానికి అర్ధ క్షణం కూడా పట్టలేదు రామశాస్త్రికి. తానే లేచి రాజన్న దగ్గరకు వెళ్ళాడు. అది చూసిన రాజన్న తనేదో మహా పాతకం చేస్తున్న వాడిలా నిలువెల్లా ఒణికి పోయాడు.

రామశాస్త్రి రాజన్నకు ధైర్యం చెప్పి, "ఏరా! ఎవరీ కుర్రాడు? నీ కొడుకా?" అని అడిగి, "నా గురించే వచ్చావా?" అని కూడా అడిగాడు.

"సిత్తమండయ్యగోరూ!" రాజన్న వినయ పూర్వక సమాధానం.

"మరి చెప్పడానికి సందేహం ఎందుకురా!" రామశాస్త్రి ఆదరణ పూర్వకమైన మందలింపు.

"మరేం లేదండయ్యగోరూ! ఈడు..." అని కొడుకును చూపించి, "సదుంకోవాలంటున్నాడండి" అన్నాడు.

రామశాస్త్రి పెద్దగా చదువుకోలేదు. స్వాతంత్ర్యం రావడానికి ముందు కాలంలో థర్డుఫారం వరకూ చదువుకుని టీచరు ట్రయినింగయ్యాడు. ఈనాడు మెట్రిక్యులేషన్ పిల్లలకు కూడా సునాయాసంగా అన్ని పాఠ్యాంశాలూ బోధించగలడు. ఆయన దగ్గర తొలి చదువులు చదివిన ఎందరో వ్యక్తులు నేడు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రెండిటా కూడా ఉన్నత పదవులలో ఉన్నారు.

"ఈడు తమకాడె సదవాలంటున్నాడయ్యగోరూ!" అన్నాడు రాజన్న.

ఆనాటికి కులంతో నిమిత్తం లేకుండా ఎవరయినా పాఠశాలకు వచ్చి చదువుకోవచ్చునని ప్రభుత్వ ఆజ్ఞలున్నా రామశాస్త్రి నివశిస్తున్న ఊళ్ళవంటి చోట్ల రాజన్న కులం వంటి వాళ్ళు తమ పిల్లలను పాఠశాలలకు పంపడంలేదు. దానికి ముఖ్యమైన కారణాలు రెండు. పెద్దింటి దొరల ఆగ్రహానికి గురవుతామనే భయం ఒక కారణం. ఆ చిన్న వయసు నుండీ తమ పిల్లలను ఏ దొరదగ్గరో పశువులు మేపే పనిలో పెడితే వాడికి కడుపునిండా తిండి దొరకడంతో బాటు ఇంటికి నాలుగు గింజలు కూడా వచ్చి పడతాయన్నది రెండో కారణం.

రామశాస్త్రి మనసులో ఈ ఆలోచనలన్నీ సుళ్ళు తిరుగుతున్నాయి.

శాస్త్రి మౌనాన్ని మరో విధంగా అర్థం చేసుకున్న రాజన్న, "అక్కడికి ఎవరికి సెప్పాలో వాళ్ళకి మరీ చెప్పానండి. ఎవరూ మనకి సదువులొంటబట్టవురా! ఒక్క దొరగారింటో పాలేరు తనానికి కుదిరావంటే రోజెళ్ళి పోద్దిరా అని. కాని ఇనిపించుకోటం లేదండయ్యగోరూ!" అన్నాడు.

"రాజన్నా! మీ వాళ్ల కుర్రాళ్లని కూడా స్కూళ్లకు పంపించండిరా! చక్కగా చదివించండిరా! ప్రభుత్వం కూడా ఎన్నో రాయితీలు కల్పించడమే కాక ఎన్నో సదుపాయాలు కూడా చేస్తోందిరా! అని నేనెన్నిమార్లు మీకు చెప్పాను? ఎవరైనా నా మాట విన్నారా? వాడు చదువుకుంటానన్నదే చాలని సంతోషంతో ఎగిరిగంతేసి బడికి పంపాలి కాని, దూడలను కాచుకుని బతకమనడం ఏమిట్రా!" అని, "మీవాడి పేరేమిట్రా?" అన్నాడు రామశాస్త్రి.

"అడి పేరాబాబూ! ఎనకయ్యండి" అన్నాడు రాజన్న.

రాజన్న భాషలో ఎనకయ్య అన్న పేరు వెనకయ్య శబ్దానికి వికృతి.

"బాగుందిరా రాజన్నా! కొడుక్కి వినాయకుడి పేరు పెట్టుకున్నావన్నమాట."

"నా నెట్టలేదండయ్యగోరూ! ఈడి ముద్దూ ముచ్చటా చూసుకో గలిగిన బాగ్గెం లేకపోయినా మా ఆడదే ఆ పేరెట్టుకుందండి. దానికి ఎనకయ్యా మీద శానా బగితండి." చనిపోయిన తన భార్య తాలూకు భక్తి గురించి తన్మయంగా చెప్పసాగాడు రాజన్న.

"సరేరా రాజన్నా! ఈ రోజు నుండి మీ వాడి పేరు గణేష్‌గా మారుస్తున్నాను." అని, ఆ నామ నక్షత్రాన్ని బట్టి ఏవో గుణకారాలూ భాగహారాలూ మనసులో నే లెక్కించి, "రాజన్నా! మీ వాడిని రేపటి నుండి బడికి పంపించు" అన్నాడు రామశాస్త్రి.

"అయ్యబాబోయ్! అయ్యబాబోయ్! బడికేనాండి! పెద్దోర లూరుకుంటారాండి! నా కొంపకి పందిరెయ్యారండీ! నా నోటికాడ కూడు మట్టిలో కలపరంటండయ్యగోరూ!" అన్నాడు రాజన్న భయంతో ఒణికిపోతూ.

అనాదిగా వస్తున్న ఆచారం పేరిట వేలామణీ అవుతున్న అన్యాయమే న్యాయమని మూఢంగా నమ్ముకుంటూ వస్తున్న రాజన్నను చూసి జాలిపడ్డాడు రామశాస్త్రి. 'అవును, వాడు చెప్పినట్టు ఊరిపెద్దలు ఎంతకయినా తెగించగలరు. రాజన్నను అనవసరంగా ఎందుకు ఉసురుపెట్టడం?' అని మనసులో అనుకుని, "పోనీ ఓ పని చెయ్యి రాజన్నా!" అన్నాడు రామశాస్త్రి.

"సెలవిప్పించండయ్యగోరూ!"

"ఏమీలేదురా! మీ గణేష్‌ను రేపటినుండి మా యింటికి పంపించు."

"అయ్యగోరూ! తమరు యిబ్బందిలో పడతారేమో బాబూ!" రాజన్న సందేహం.

"అంతా నేను చూసుకుంటానులేరా!" చెప్పాడు రామశాస్త్రి.



త్వరలో
డా. కొత్త రవీంద్రబాబు మరో సస్పెన్సు సీరియల్

మోహినీ తాండవం!
ఆంధ్రసచిత్రవారపత్రికలో ప్రారంభం

రామశాస్త్రి చెప్పిన ప్రకారం మర్నాడు సాయంత్రం రామశాస్త్రి యింటికి వచ్చాడు గణేష్. చినిగిపోయి వదులుగా మొలమించి జారిపోతున్న నిక్కరును పైకి ఎగలాక్కుంటూ బిక్కు బిక్కుమంటూ దిక్కులు చూస్తూ రామశాస్త్రి ఇంటిముంగిట్లో తచ్చాడసాగాడు గణేష్.

లోపలినుండి వాణ్ని చూసిన రామశాస్త్రి భార్య గయ్యిమంటూ వచ్చి "ఒరే వెధవా! ఎంత ధైర్యంరా నీకు! ఏకంగా వాకిట్లోకే వచ్చేశావే!" అంది.

ఆమె మాటలకు గణేష్ భయపడిపోయాడు. ఒక్క ఉదుటున రోడ్డుమీదకు పరుగెత్తబోయాడు. ఆమె కంఠస్వరం విని బయటకు వచ్చాడు రామశాస్త్రి. బయటకు పోబోతున్న గణేష్‌ను చూచి, "ఒరేయ్ గణేష్! వెళ్ళిపోతున్నావేంరా? ఇలారా!" అనునయంగా పిలిచాడు.

రామశాస్త్రి భార్యవైపు బెదురు చూపులు చూస్తూ తిరిగి యింటి వాకిట్లోకి వచ్చాడు గణేష్. గణేష్‌ను అరుగుమీద కూచోబెట్టాడు రామశాస్త్రి.

చోద్యంగా చూస్తూ నిలబడింది రామశాస్త్రి భార్య రాజ్యం.

రామశాస్త్రి యింట్లోకి వెళ్ళి కొద్ది క్షణాల్లోనే తిరిగివచ్చాడు. అతడి చేతిలో ఒక పలక బలపం ఉన్నాయి. ఇంటరుగుమీద ఓ మూలగా భయం భయంగా చూస్తూ కూచుని ఉన్న గణేష్‌ను బుజ్జగించాడు రామశాస్త్రి. రామశాస్త్రి చేతిలో ఉన్న పలకా బలపాలవైపు ఆశగా ఆరాధనాపూర్వకంగా చూస్తున్నాడు గణేష్. రామశాస్త్రి పలకమీద 'అ ఆ' అని రాసి గణేష్ ఒడిలోపెట్టి, చేతికి బలపంయిచ్చి వాడి చేయిపట్టుకుని దిద్దడం నేర్పసాగాడు.

అంతవరకూ చోద్యంగా చూస్తూ నిలబడి ఉన్న రాజ్యానికి ఆ దృశ్యం కళ్ళబడింది. ఆవిడలో ఆగ్రహం ఆజ్యం తోడయిన అగ్నిలా పెల్లుబికింది. ఆవేశం హద్దుమీరింది. ఒక్క ఉరుకున అరుగుమీదకు వచ్చి, "అయ్యయ్యో! అయ్యయ్యో! ఎంత అఘాయిత్యం! ఎంత అఘాయిత్యం!" అని దవడలు నొక్కుకుని ఇంటి ఆచారం అంతా మంటకలిపారనీ, యిల్లంతటినీ మైల చేసిపారేశారనీ చిందులు తొక్కసాగింది..

రామశాస్త్రి లేచి ఆమె దగ్గరగా వెళ్ళాడు. ఆమెను అనునయించబోయాడు.

"చూడు రాజ్యం!" అంటూ భుజంమీద చేయివేయబోయాడు.

రాజ్యం చటుక్కున రెండడుగులు వెనక్కివేసింది. "అక్కడే ఆగండి! నన్ను ముట్టుకోకండి. అపవిత్రమైన మీ చేతులతో నన్ను తాకకండి. మా తాత తండ్రుల నందరినీ నరకకూపంలోకి నెట్టకండి." అంది ఉరిమిచూస్తూ.

ఆమె మాటాడిన తీరుకు రామశాస్త్రి నిర్విణ్ణుడయాడు.

"రాజ్యం! అనవసరంగా ఆవేశపడకు. నేనేం కానిపని చెయ్యలేదే!" అన్నాడు.

"ధర్మవిరుద్ధంగా నడుచుకుంటున్నారు. పైగా సమర్థించుకుంటున్నారా?" అంది ఉరిమి చూస్తూ.

రామశాస్త్రి భగవద్గీత, పురాణేతిహాసాల నుండి సూక్తులు కొన్నిటిని చెప్పి ఆమెను సమాధానపరచ చూశాడు.

"వాడికి! ఆ అంటరానివాడికి! చదువా? అది మీరు చెప్తారా? ఛీత్తు! నలుగురూ చూస్తే నవ్విపోరూ? అప్రదిష్ఠకాదూ? కులం నుండి వెలియ్యరూ?" ఆవేశంగా అంది రామశాస్త్రి భార్య రాజ్యం.

"పోనీలే! రేపటినుండి మనపాలెం గట్టుమీది పాకలో వీడికి చదువు చెబుతాను. నీ మనసు కష్టపెట్టడం ఎందుకు?" అన్నాడు రామశాస్త్రి రాజీధోరణిలో.

ఆమె ఆ రాజీపద్ధతికి ససేమిరా అంది.

ఇక ఆమెకు ఏమిచెప్పి లాభంలేదన్న నిర్ధారణకు వచ్చాడు రామశాస్త్రి. తన విద్యుక్తధర్మం తాను నెరవేర్చుకుంటూ పోయాడు. ఊరి పెద్దల పిల్లలు వాళ్ళామంది అతని దగ్గర ట్యూషన్ చెప్పించుకుంటున్నారు అంతవరకూ. ఎప్పుడయితే రామశాస్త్రి గణేష్‌ను చేరదీశాడో అప్పుడు ఊరి పెద్దలందరూ మండిపడి పోయారు. రామశాస్త్రి వారందరికీ వినయంగా తాను చేస్తున్న పనిలో దోషం ఏమిలేదని నచ్చచెప్ప చూశాడు. కాని వారిముందు అతడి మాటలు చెవిటివాడిముందు శంఖునాదం చందమే అయాయి.

ఆ మరునాటినుండి వారిపిల్లలు రావడం మానుకున్నారు. నిజానికి అది రామశాస్త్రికి చెప్పుకోతగ్గ ఆదాయలోపమే! అయినా అతడు వెనక్కు తగ్గలేదు. ఒక్క పతితుడినైనా ఉద్ధరించకలిగితే తానుయిన్నాళ్ళూ అనుసరిస్తూ వస్తున్న గాంధేయ సిద్ధాంతాలకు సార్థకత చేకూర్చినట్టే అనుకున్నాడు.

భార్య రామశాస్త్రికి పెరటి వరండాలో ఆకువేసి అన్నం వడ్డిస్తోంది. ఆమెతో అనవసరంగా ధర్మాలను చెప్పడం రామశాస్త్రికి యిష్టంలేదు. అందుకని తన విస్తరి తానే ఎత్తి పెరటిలో పారవేసి తిన్నచోట పేడతో అలుకుతున్నాడు. ఆదే దారిలో పడుతుంటున్నాడు. అయినా అలవాటుగా వస్తున్న తనచిత్త కర్మానుష్ఠానాలలో మాత్రం ఏ లోటూ రానివ్వడంలేదు.

మరో రెండు రోజులకు తల్లి కబురందుకుని మేనమామ యింటినుండి వచ్చాడు రామశాస్త్రి కొడుకు. అతడికి చదువు సంధ్యలు అబ్బలేదు. మేనమామకు ఒక్కతే ఆడపిల్ల కావడంతో తల్లిదండ్రుల యిష్టం మీద ఇల్లరికం వెళ్ళిపోయాడు. మామగారి సమస్తం మీద అజమాయిషీ చేస్తున్నాడు.

ఒకరికి మరొకరు తోడు కావడంతో గణేష్ విషయంలో రామశాస్త్రిమీద ఒత్తిడి మరింత పెరిగింది. తనకు తోచినది, అదీ ఓ మంచి పని చేద్దామని పూనుకుంటే వీళ్ళకు ఇంత అభ్యంతరం

దేనికి? కనీసం యింత వయసు వచ్చిన తనకూ ఓ వ్యక్తిత్వం ఉంటుందన్న ఇంగితజ్ఞానం కూడా లేదేమి వీళ్లకు?

అక్కడికీ తనే రాజీపడి గణేష్‌కు ఎక్కడో యింటికి దూరంగా పొలం గట్టుమీద చదువు చెప్పుకుంటానన్నా వీళ్లకేమిటి బాధ? పోనీ, లేని పోని రభస ఎందుకని గణేష్‌ను యిక చదువుకుందుకు రావద్దని చెబుదామా అనుకున్నాడు. కాని మరుక్షణంలోనే జ్ఞాపకం వచ్చింది రామశాస్త్రికి. తను యిలా అక్షరాలు రాసి యిచ్చి ఇలా దిద్దాలని నేర్పాడో లేదో అలా వాటిని తిరిగి రాసి చూపించాడు గణేష్. శుద్ధ మొద్దుకు కూడా ఏదో విధంగా విద్యను వంట పట్టించాలని చూస్తారు రామశాస్త్రివంటి మంచి ఉపాధ్యాయులు. అలాటిది ఒక వారం మించకుండానే అక్షరమాల నేర్చిన విద్యార్థిపట్ల ఎంతటి ఆదరం ఉంటుంది!

రామశాస్త్రి గణేష్‌కు చదువు మొదలుపెట్టి నెలకూడా పూర్తిగా అవలేదు. అయినా వాడప్పుడే గుణింతాలు కూడా నేర్చి చిన్న చిన్న పదాలను చదవడమేగాక రాసి చూపిస్తున్నాడు కూడాను. అలాటి మేధావికి చదువు చెప్పే అదృష్టం కలగడం తన పూర్వజన్మ సుకృతమే అనుకున్నాడు రామశాస్త్రి.

దాంతో తన నిర్ణయం ఏమిటో కుండ పగులగొట్టినట్టు చెప్పేశాడు రామశాస్త్రి.

"అయితే యిక నీకూ నాకూ మధ్య ఉన్న ఋణబంధం ఈనాటితో తెగిపోయినట్టే!" కోపంతో ఊగిపోతూ చెప్పాడు కన్న కొడుకు.

రామశాస్త్రి ఏమీ మాట్లాడలేదు.

"ఇలాంటి అప్రాచ్యపు కొంపలో మరో క్షణం కూడా ఉండలేను. నేనూ నా బాబుతో బాటు మా అన్నయ్య ఇంటికి వెళ్లిపోతాను. ఎవరి కర్మానికి ఎవరు కర్తలు "?" రుసరుసలాడుతూ చెప్పింది ధర్మపత్ని. సహధర్మచారిణి రాజ్యాం.

ఆమె మాటలకూ రామశాస్త్రి మౌనమే జవాబయింది.

తమ మాటను ఏమాత్రం ఖాతరు చెయ్యలేదన్న ఉక్రోషంతో తల్లీ కొడుకు లిద్దరూ అపూటే ప్రయాణం కట్టారు.

రామశాస్త్రి వాళ్లను అభ్యర్థించనూ లేదు. అభ్యంతరమూ పెట్టలేదు.

ఆ మరునాడు రాజన్న వచ్చాడు. రాజన్న రోగంతో తీసుకుంటూ ఈసురోమంటూ ఉన్నాడు. అయినా ఓపిక చేసుకుని కర్ర ఊతంతో వచ్చాడు. "అయ్యాగోరూ! మా కుర్రెదవ సదువుకోసం మీ బతుకు బుగ్గికాకూడదు బాబూ! అణ్ణీ ఇంక సదుంకుందుకు రమ్మనకండి. అమ్మగారిని రమ్మని కబురెట్టండి బాబయ్యా!" అని బావురుమన్నాడు.

రామశాస్త్రి రెండు క్షణాలు మౌనంగా ఉండిపోయాడు. మంచో చెడో తానో నిర్ణయం తీసుకున్నాడు. తను తీసుకున్న నిర్ణయం ఇంట్లో దుమారం లేవదీయవచ్చుననే అనుమానం అతడికి

# ఎవడు కొడుకు?

లేకపోలేదు. అయితే అది అంత తీవ్రస్థాయి పెనుతుఫానుగా ఉంటుందని ఊహించ లేకపోయాడు. తాను ఒంటరివాడైపోయానా అన్న దిగులు అతడి గుండెను కుదిపింది. అదయినా ఒక్క క్షణంపాటే! 'ఆపదలందు ధైర్య గుణము...' అనే సుభాషితరత్నాన్ని గుర్తుకు తెచ్చుకుని ధైర్యం వహించాడు. రాజన్నకు చెప్పవలసిన విధంగా నచ్చచెప్పి పంపించాడు.

అది జరిగిన కొద్ది రోజులకే రాజన్న మరణించాడు. ఉన్న దిక్కును కూడా కోల్పోయిన గణేష్ భారం రామశాస్త్రి తనకు తానుగా పూర్తిగా భుజాలమీదకు ఎత్తుకున్నాడు. గణేష్ ఆలనా పాలనా, తిండి తిప్పలూ అన్నీ రామశాస్త్రి స్వయంగా స్వీకరించాడు. గణేష్ చదువు నిర్విఘ్నంగా కొనసాగేటట్టు చూస్తున్నాడు




రామశాస్త్రి.

ఊరి బ్రాహ్మణ్యం రామశాస్త్రిని వెలి వేసింది.

కొంతకాలం గడిచింది. ఆ చుట్టుపక్కల పరగణాలో ఘనాపాఠీగా పేరుగాంచిన చైనులు రామశాస్త్రి దగ్గరకు వచ్చాడు. రామశాస్త్రి కూచున్నవాడు లేచి చైనులును వచ్చి అరుగుమీద కూచోమని అడిగాడు.

"కూచుందుకేంగాని రామశాస్త్రీ!" అని. "ఎందుకొచ్చిన గొడవ చెప్పు! ఆ దిక్కుమాలినవాడేమయిపోతే నీ కెందుకు?ఇప్పటికైనా వాణ్ణి వదలించుకో! వాడేం చదివి ఊళ్ళేలినా ఎవరిని ఉద్ధరించేను. ఎక్కడ వాళ్లను అక్కడే ఉంచాలయ్యా! అర్హతలేని వాళ్లను, అందలం ఎక్కించకూడదు. నా మాట విను. వాణ్ణి పొమ్మను. లక్షణంగా అందరితో కలిసి ఉందువుగాని. నీమీద ఉన్న వెలి నిముషాలమీద ఎత్తించేసే పూచీ నాదీ!" అన్నాడు చైనులు ముక్కుపొడుం బర్రున ఎగపీలుస్తూ.

రామశాస్త్రి చైనులు చెప్పినదంతా శ్రద్ధగా విన్నాడు. విషాదంగా ఓ చిరునవ్వు నవ్వి "చూడండి చైనులుగారూ! మీరు వేదం అంతా పరిపూర్ణంగా చెప్పుకున్నారు. మనిషికి మనిషికి మధ్య కులమనే అడ్డుగోడ మీకు వేద పనసల మధ్య ఎక్కడయినా తారసపడిందా? పోనీ, నేడు మనవాళ్ళు పరమ ప్రామాణ్యంగా భావించే భగవద్గీతనే తీసుకుందాం! అస్పృశ్యత అనే పదం అందులోని పద్దెనిమిది అధ్యాయాల్లోనూ ఎక్కడయినా లిఖించబడిఉందా? "చాతుర్వర్ణ్యం మయా సృష్టం గుణకర్మ విభాగశః!" అన్నాడు గీతాకారుడు. ఆ శ్లోకం ప్రకారం చూస్తే వ్యవసాయం చేసుకుంటూ బ్రతుకుతున్న నా కొడుకు కులం ఏమిటి? సారా తాగి, కారాకిళ్లీ బిగించి సానికొంపల వెంబడి తిరుగుతూ సప్త వ్యసనాలకూ బానిస అయిన మీ కొడుకు కులం ఏమిటి?" అని అడిగాడు రామశాస్త్రి.

దానితో చైనులు కోపం తారాస్థాయి నందుకుంది. "ఏదో పొలమో చెక్కో కొంత ఉండనేకదూ నీ అహంకారం? తలదాచుకుందుకో గూడుండనేకదూ నీ గీర? ఉండు చెబుతాను! నిన్ను వీధులు పట్టించకపోతే నాపేరు చైనులే కాదు" అంటూ సభ్య ప్రపంచం ఉచ్చరించడం మాట దేవుడెరుగు కనీసం వినడానికి కూడా సిగ్గుపడే అసభ్య పదజాలంతో తిడుతూ వెళ్లిపోయాడు.

మరో పక్షం రోజులు గడిచాయి. రామశాస్త్రి పేర ఓ రిజిష్టర్డు నోటీసు వచ్చింది. రామశాస్త్రి అనుభవిస్తున్న పొలం, నివశిస్తున్న యిల్లు తన తాత ద్వారా రామశాస్త్రికి సంక్రమించినవి కావడంచేత వాటిలో తన వాటా తనకు పంచి యివ్వకపోతే కోర్టు ద్వారా న్యాయం పొందవలసి ఉంటుందని కొడుకు లాయరు ద్వారా యిప్పించిన నోటీసది.

రామశాస్త్రి వెంటనే తన పేరనున్న ఆస్తి కొడుకుపేర మార్పించి దస్తావేజు తిరుగు టపాలో పంపించాడు. అప్పటికి గణేష్ మెట్రిక్ పాసయ్యాడు. అదియూనివర్శిటీకంతా సర్వోత్కృష్టుడుగా.

రామశాస్త్రి గణేష్‌ను కాలేజీలో చేర్పించాడు. అతడు మెట్రిక్‌లో తెచ్చుకున్న మార్కుల ఆధారంగా అయితేఏమి, అతడు జన్మించిన కులం ఆధారంగా అయితేనేమి ఆనాటినుండి గణేష్ భారం ప్రభుత్వమే తీసుకుంది.

గణేష్ అప్పటికి కొద్ది సంవత్సరాల పూర్వం నుండి రామశాస్త్రిని 'బాబయ్యగారూ!' అని పిలవసాగాడు. రామశాస్త్రి కూడా 'నాయనా!' అనే గణేష్‌ను పిలిచేవారు. గణేష్‌ను కాలేజీలో చేర్పించి తిరుగు ప్రయాణం కట్టిన రామశాస్త్రి నుద్దేశించి, "బాబయ్యగారూ! ఉన్న యిల్లు, భూమి మీ అబ్బాయి హస్తగతం చేసుకున్నారు. మరి నా చదువు గట్టెక్కి నాలుగు రాళ్లు సంపాదించుకునే వరకూ మీరు కాలక్షేపం చెయ్యడం ఎలా? నాకు నెలనెలా వచ్చే స్కాలర్‌షిప్పులో ఏదో కొంత మీకు

పంపిస్తాను" అన్నాడు.

"చూడు నాయనా! నీకు వచ్చే స్కాలర్‌షిప్పు గోచీకి పెద్ద అంగోస్త్రానికి చిన్న. నువ్వు ఎంతో పొదుపుగా వాడుకుంటేనే గాని అది నీ అవసరాలకే అంతంత మాత్రంగా ఉంటుంది. నా సంగతి అంటావా? జీవితంలో చరమాంకానికి చేరినవాణ్ని. ఏవో నాలుగు ప్రయివేట్లు చెప్పుకుంటే బ్రతుకు వెళ్లమారిపోతుంది. నా గురించి నువ్వేం దిగులుపడకు. నువ్వు ఐ. ఏ. ఎస్. ఆఫీసరువి కావాలన్నది నా ఆకాంక్ష. అదే నీ ధ్యేయంగా పెట్టుకో!" అని వెళ్ళిపోయాడు రామశాస్త్రి.

శరవేగంతో పరుగెత్తడం కాలం లక్షణం.

ఓడలను బళ్ళుగానూ, బళ్లను ఓడలుగానూ మార్చడం కూడా కాలం తాలూకు ఓ విచిత్రం.

రామశాస్త్రి ఆకాంక్షకు అనుగుణంగా గణేష్ ఐ. ఏ. ఎస్. అయ్యాడు. తమ పక్క జిల్లాకు కలక్టరయ్యాడు.

తాను కలక్టరు కాగానే రామశాస్త్రిని తన దగ్గరకు వచ్చి ఉండమని ఉత్తరం కూడా రాశాడు.గణేష్ చదువు సాగుతున్న కాలంలో పడరాని పాట్లు పడ్డాడు రామశాస్త్రి. ఎక్కడ పని దొరికితే ఆ పని చేసుకుంటూ ఎన్నో ప్రదేశాలు తిరిగాడు. తిరిగి స్వగ్రామానికే చేరుకోవాలన్న తపన ఎక్కువకావడంతో అక్కడికే చేరుకున్నాడు.

బ్రాహ్మణ్యంలోఎలాగూ తనను చేరనివ్వరు. తలదాచుకుందుకు గూడు కూడా లేదు. ఎలాగా అని రామశాస్త్రి మథనపడుతున్న సమయంలో ఆపద్బాంధవుడులా ఆదుకున్నాడు పెదకాపు.

పెదకాపు తన కొబ్బరితోటలో వున్న పశువుల కొట్టంలో కొంత మేర శుభ్రం చేయించి శాస్త్రికి వసతి ఏర్పాటు చేశాడు. తన మనుమలను శాస్త్రి వద్ద చదువుకుందుకు పంపిస్తూ స్వయంపాకం ఏర్పాటు చేశాడు. మధ్య మధ్య వృద్ధాప్యం కారణంగా

## ఎవడు కొడుకు?

అనారోగ్యానికి గురవుతూ లేచిన రోజున లేస్తూ లేవలేని రోజున పడకేస్తూ రోజులు దొర్లించుకు వస్తున్నాడు రామశాస్త్రి.

సరిగా అలాటి తరుణంలో గణేష్ ఉత్తరం అందింది శాస్త్రికి. కాని వెంటనే వెళ్ళి తన భారం అతడిపై మోపడం భావ్యంగా అనిపించలేదు రామశాస్త్రికి. కాకపోయినా "తను గణేష్‌కు చేసిందేపాటి?' అని కూడా అనుకున్నాడు.

ఒకసారి జ్వరపడి ఆ పట్టు పట్టు పదిరోజులు లేవలేకపోయాడు రామశాస్త్రి.

"గణేష్‌కు కబురు పెట్టమంటారా?" అని అడిగాడు పెదకాపు.

శాస్త్రి అంగీకరించలేదు. జ్వరం తగ్గింది. కాని నీరసం తగ్గటంలేదు. పెదకాపు అతడిని ఆదుకుంటున్నాడు.

"బాగా నీరసపడిపోయారు. కనీసం మీ అబ్బాయి దగ్గరకైనా వెళ్లండి. ఎంతయినా కన్న కొడుకు. మీ ముప్పు గడపవలసిన వాడు. పైగా మీరు అతడికి ఆవగింజంతయినా అన్యాయం చెయ్యలేదు. ఏదో అప్పట్లో మాట మీద మాట అనుకున్నా అతడు మీకు కొడుకు కాకపోతాడా మీరతనికి తండ్రి కాకపోతారా? రక్త సంబంధాలంత సులువుగా తెగిపోతాయా చెప్పండి! పెద్దవారై పోయారు. ఎన్నాళ్ళిలా ఒంటరిగా బాధపడ్తారు!" పెదకాపు అభ్యర్థన కాదనలేక కన్నకొడుకు దగ్గరకు వెళ్లడానికి ఒప్పుకున్నాడు రామశాస్త్రి.

మరునాడుదయం పెదకాపు స్వయంగా దగ్గరుండి బస్సెక్కించాడు రామశాస్త్రిని. కొడుకు ఉంటున్న ఊరికి భోజనాల వేళకు చేరుకున్నాడు శాస్త్రి. తన బావమరిది యిల్లే కనుక తనకు తెలిసినదే కనుకనడిచి ఇంటికి చేరుకున్నాడు.

ఇంటి వాకిటనే ఎదురుపడ్డాడు కొడుకు. రామశాస్త్రి కొడుకు వైపు ఉత్సాహంగా నడిచి, ఆనందంగా పలకరించబోయాడు.

"ఆగక్కడ!" గద్దించాడు కొడుకు.

రామశాస్త్రి చటుక్కున ఆగిపోయాడు.

"ఎవరు నువ్వు?" పెడసరంగా అడిగాడు కొడుకు.

కొరడా దెబ్బ తగిలినట్టు విలవిలలాడింది రామశాస్త్రి మనసు. కళ్ళు చెమర్చాయి. తమాయించుకుని, "నీ తండ్రినిరా!" అతడి గొంతులో జీర.

"వెళ్ళు వెళ్ళు! ఏనాడయితే నువ్వు నా మాటకు విలువివ్వలేదో ఆనాడే తెగిపోయింది ఆ బంధం. పెంచుకున్నావుగా ఒకణ్ని! వాడి దగ్గరికే వెళ్ళు!"

లోపల నుండి అప్పుడే బయటకు వచ్చిన రాజ్యం కళ్లబడింది ఆ దృశ్యం.

"అదేమిటిరా నాయనా! చెట్టంత తండ్రిని పట్టుకుని అలా అంటావు?" అంది.

"ఓహో! అలాగా! ఇవాళ నీకూ పుట్టుకొచ్చిందన్న మాట! అయితే ఇకనేం? నువ్వూ వెడితే సరి!" అన్నాడు. 'మీరిద్దరూ దారినిపోయే తద్దినాలు సుమా!' అన్నట్టుందతడి కంఠస్వరం.

రాజ్యం ఖిన్న వదనంతో నిలబడిపోయింది.

రామశాస్త్రి వెనక్కు తిరిగాడు. లాల్చీ జేబుపై నుండే తడిమాడు. ఉత్తరం చేతికి తగిలింది. గణేష్ ప్రేమగా తనను రమ్మని పిలుస్తూ రాసిన ఉత్తరం అది.

రామశాస్త్రి నెమ్మదిగా నడవసాగాడు. తనే కొడుకు నిర్దాక్షిణ్యంగా తనను తరిమివేశాడన్న విచారం యిప్పుడతని మనసులో ఎంత మాత్రం లేదు.

తన గమ్యం నిర్ధారణ అయిపోయింది. ●

## మిథున్-సుమలత



మిథున్ చిత్రాలు అనేకం ఫ్లాప్ అయినప్పటికీ యిటీవలి కొన్నిచిత్రాల (అంత హిట్ కాకపోయినా) పుణ్యమా అని బిజీ హీరో అయిపోయాడట. 'త్రినేత్ర', 'స్వర్గ్‌యహా నరక్‌యహా' అనే చిత్రాల షూటింగ్ కార్యక్రమంలో నిమగ్నమయ్యాడు మిథున్. విమల్‌కుమార్ దర్శకత్వంలో తయారవుతున్న 'స్వర్గ్ యహా...' చిత్రంలో మిథున్ సరసన సుమలత నటిస్తోంది.

ఈ చిత్రంలో ద్విపాత్రాభినయం చేస్తున్న మిథున్ తండ్రీ కొడుకుల పాత్రల్లో కనిపిస్తాడు. తండ్రిగా వేస్తున్న మిథున్‌కు జంటగా సుమలత, కొడుకు జంటగా శిల్పా శిరోద్‌కర్ నటిస్తున్నారట.